దండాలయ్యా...ఉండ్రాలయ్యా

- ఘనంగా వినాయక చవితి వేడుకలు
- వాడవాడలా పూజలు

ఉయ్యూరు: వినాయక చవితి వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. వాడవాడలా కొలువుదీరిన గణనాథుడికి భక్తులు విశేష పూజలు జరిపించారు. దండాలయ్యా..ఉండ్రాలయ్యా..అంటూ విశేష పూజలు చేశారు. పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో ప్రధాన కూడళ్లు, సెంటర్లలో పందిళ్లు ఏర్పాటుచేసి వినాయకుడి ప్రతిమలను పెట్టి పూజలు చేశారు. ఆలయ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉయ్యూరు పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వినాయక చవితి పండుగను సోమవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉయ్యూరు చింతలతోటలో మంగళవారం విఘ్ననాథుడిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. బస్టాండ్ సెంటరు, విఘ్నేశ్వర ఆలయం వద్ద, ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణం, కొబ్బరితోట, సుందరంపేట, కాటూరు రోడ్లలో రెండో రోజు విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేయించారు.

- **కంకిపాడు:** గణేష్ నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. వినాయక చవితి పర్వదినాన్ని సోమవారం అంతటా భక్తులు భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు. గ్రామ గ్రామాన మట్టి వినాయక విగ్రహాలు, భారీ గణనాథుడి విగ్రహాలను చలువ పందిళ్లలో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండో రోజైన మంగళవారం చలువ పందిళ్లలో కొలువైన విఘ్నేశ్వరుడికి దంపతులు పీటలపై కూర్చుని పూజా కార్యక్రమాలు జరిపించారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. గణేష్ నవరాత్రుల ఉత్సవాల కార్యక్రమాల్లో నిబంధనలు పాటించేలా ఎస్‌ఐ కె.సుధాకర్ పర్యవేక్షిస్తున్నారు.

రూరల్‌లో చవితి వేడుకలు

గన్నవరంరూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం వినాయక చవితి సందర్భంగా అన్ని గ్రామాల్లోనూ ఉత్సవ కమిటీలు


కానూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో పూజలు


నున్న తూర్పు రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

విశేష పూజలు చేశారు. గణనాయకుడికి ప్రీతికరమైన పత్రిని మండపాలలో ఉంచి పూలు, పండ్లు, ఉండ్రాళ్లు, కుడుములు, శనగలు సమర్పించారు. దంపతులు పీటలపై కూర్చుని గణేశుడిని ప్రార్థించారు. మంగళవారం వినాయకుడికి ఆయా మండపాల్లో పూజలు చేశారు. చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్దార్థ మెడికల్ కళాశాల దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాల్లో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, సుధా దంపతులు పూజల్లో పాల్గొన్నారు. భక్తులు గణనాయకుడిని దర్శించుకున్నారు.

గ్రామాల్లో వినాయక చవితి పూజలు

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి వేడుక


ఉయ్యూరు చింతలతోటలో పూజలందుకుంటున్న భారీ గణనాథుడు

లను భక్తులు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. నున్న గ్రామంలో తూర్పు కోదండరామాలయం వద్ద 12వ సంవత్సరం చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. భీమవరపు వెంకటరెడ్డి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహవచన, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. కోటకట్ట సెంటర్, చెరువు సెంటర్, లోయబాట సెంటర్, పడమర బజారు లైబ్రరీ వద్ద, హైస్కూల్ టర్నింగ్ రంగా బొమ్మవద్ద, శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద, బోడపాడు, సుగాలీకాలనీ పలు చోట్ల గ్రామంలో వేడుకలను నిర్వహించారు. గ్రామంలో ప్రసిద్ధ దేవస్థానం చినకంచితో పాటు పాతపాడు గ్రామం, విలేజీ కండ్రిక, సీతారామపురం, వెంకటాపురం, అప్పారావుపేట, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో వేడుకలను నిర్వహించారు.

పెనమలూరులో..

పెనమలూరు: మండల పరిధి కానూరులోని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ కార్యాలయంలో పెనమలూరు మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ నీనావత్ చిన్ని దంపతులు వినాయకుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు వచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. యనమలకుదురు గ్రామంలోని పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్ని దేవాలయాల్లో వినాయకుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కానూరు తులసీనగర్‌లో వినాయకుడి కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో


పూజలో పాల్గొన్న సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వరరావు, సుధా దంపతులు


పెనమలూరులో గణనాథుని భారీ విగ్రహం


తాడిగడప శ్రీనగర్ కట్టవద్ద వినాయకుడు


కానూరు తులసీనగర్‌లో గణనాథుడు

వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి కాలనీ వాసులు పూజలు చేశారు. పోరంకి గంగానమ్మ గుడి వద్ద బొర్రా యూత్ ఆధ్వర్యంలో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ బొర్రా కనకదుర్గ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. తాడిగడప శ్రీనగర్ కాలువ కట్టపై శివనాగేంద్ర స్వామి వారి సన్నిధిలో వినాయకచవితి ఉత్సవాలు ప్రారంభించారు. పెనమలూరు పల్లిపేటలో భారీ వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. మండల పరిధిలో దాదాపు 40 వినాయకుడి పందిళ్లు ఏర్పాటు చేసి సందడిగా ఉత్సవాలు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఇన్‌చార్జి కార్యదర్శుల నియామకం

పెనమలూరు: మండల పరిధిలో రెండు గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులను నియమించారు. మండలంలోని చోడవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, వణుకూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మయ్యలకు డీపీపీఓలుగా పదోన్నతి రావడంతో వెళ్లి పోయారు. వారి స్థానంలో నేటికీ కార్యదర్శులను నియమించక పోవడంతో పరిపాలన సమస్యలు తలెత్తాయి. దీంతో గుడివాడ డీఎల్‌పీఓ సంపత్‌కుమారి స్పందించి గోసాల కార్యదర్శి ప్రసాద్‌కు చోడవరం అదనపు బాధ్యతలు అప్పగించింది. గంగూరు కార్యదర్శి ఎ.సుబ్బారావుకు వణుకూరు గ్రామ పంచాయతీ అదపు బాధ్యతలు ఇచ్చానని డీఎల్‌పీఓ సంపత్‌కుమారి తెలిపారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన దాత దుర్గా ఆనందరావు ఆర్థిక సహకారంతో అన్నదానం చేశారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోరంకి సూపర్ మార్కెట్‌లో చోరీ

పెనమలూరు: పోరంకి సూపర్ మార్కెట్‌లో చోరీ జరిగింది. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకిలోని ఉషోదయ సూపర్ మార్కెట్‌లో వ్యాపారం ముగించి ఈ నెల 16వ తేదీన తాళాలు వేశారు. 17వ తేదీ ఉదయం సూపర్ మార్కెట్ సూపర్‌వైజర్ కుర్రే రాజశేఖర్‌రెడ్డి తలుపులు తెరిచి చూడగా సూపర్ మార్కెట్ పైకప్పు రేకులు ధ్వంసమై ఉన్నాయి. గుర్తు తెలియని దొంగలు సూపర్ మార్కెట్ పైకప్పు రేకులు ధ్వంసం చేసి లోనికి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ 18 వేల నగదు చోరీ చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం



ఉంగుటూరు: రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. మండలంలో ముక్కపాడు, లంకపల్లి గ్రామాల్లో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో అవసరమున్న ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. సర్వేలో గుర్తించిన వారికి ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు, శస్త్రచికిత్స అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేస్తారని చెప్పారు. జగనన్న సురక్ష పథకం లక్ష్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ దయమని, ఏఎన్‌ఎం విజయకుమారి, ఆశావర్కర్ కమల, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

పెనమలూరు: పోరంకిలో వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెనమలూరు సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి సాలిపేట జేబీఎస్ అపార్టుమెంట్‌లో ఉంటున్న కోళ్ల నాగమల్లేశ్వరరావు స్థానికంగా హోటల్ నిర్వహిస్తున్నాడు. అతని తండ్రి కోళ్ల రాములు (77) కుమారుడితోనే ఉంటున్నాడు. రాములు భార్య గంగాదేవి 2021 జులైలో మృతి చెందింది. అప్పటి నుంచి రాములు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నాడు. కాగా సోమవారం అపార్టుమెంట్ ఐదో అంతస్తులో లిఫ్ట వద్ద ఉన్న ఇనుప రాడ్డుకు నైలాన్‌తాడుతో రాములు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు నాగమల్లేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు

గన్నవరం: స్థానిక గాంధీబొమ్మ సెంటర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు ఆగిరిపల్లి రోడ్డు నుంచి జాతీయ రహదారిపైకి మలుపు తిరుగుతున్న లారీని విజయవాడ నుంచి ఏలూరు వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. వేగంగా నియంత్రించలేక ముందు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన తిరివీధి భానును లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ వెనుక టైర్లు కిందపడి భాను కాలు పూర్తిగా విరిగిపోయింది. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు రంగంలోకి దిగి ప్రమాదానికి గురైన లారీలను పక్కకు తప్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా గణేష్ ఉత్సవాలు ప్రారంభం

గన్నవరం: గణేష్ ఉత్సవాలు గన్నవరం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. కేసరపల్లిలోని శ్రీగంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో గణపతి నవరాత్రులు వైభవంగా జరుగుతన్నాయి. తొలిరోజు శ్రీభువనేశ్వరీ పీఠాధిపతులు కమలానందభారతీస్వామి పాల్గొని భక్తులకు గణేష్ చతుర్థి విశిష్టతను వివరించారు. అల్లాపురంలో జరుగుతున్న గణేష్ ఉత్సవాల్లో ఎంపీపీ అనగాని రవి, సర్పంచ్ డొక్కు సాంబశివవెంకన్నబాబు పాల్గొన్నారు. గన్నవరంలోని గొడపేట, యాదవులపేట, కొత్తపేట, రాయ్‌నగర్, రామ్‌నగర్, బుద్దవరం, దావాజిగూడెం ఉత్సవ శిబిరాలను ఏర్పాటు చేసి గణనాథులకు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు.


కేసరపల్లిలో గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు

చిన్నారికి మానవత చేయూత

హనుమాన్‌జంక్షన్‌రూరల్: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చిన్నారి శస్త్రచికిత్స నిమిత్తం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సాయాన్ని అందజేసింది. బాపులపాడు గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్న పొలిమెట్ల నాగరాజు కుమారుడు రోషన్(4) హృద్రోగంతో బాధపడుతుండటంతో వైద్య ఖర్చులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో మానవత సభ్యులు రూ.7 వేలు ఆర్థికసాయాన్ని రోషన్ తల్లిదండ్రులకు అందజేశారు. మానవత జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, క్లోపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి

కంకిపాడు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్, లలిత్‌పై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మువ్వల అన్వేష్ డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని ప్రజా పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కంకిపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అన్వేష్ మాట్లాడుతూ హమారా ప్రసాద్, లలిత్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అంబేడ్కర్‌ను, రాజ్యాంగాన్ని అవమానించిన వారిని దేశ బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతినిధులు వై.నాగశ్రీనివాస్, ఎం.సాయి, సీహెచ్ దుర్గాప్రసాద్, పి.సాయి కిరణ్, పి.ధర్మారావు, జి.వరుణ్, కె.వినయ్ తదితరులు పాల్గొన్నారు.

రజకులను కించపరిస్తే సహించేది లేదు

కోడూరు: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ బెంగళూరులో ఐటీ ఉద్యోగులు చేపట్టిన నిరసనలో ఓ ఐటీ మహిళా ఉద్యోగి రజకులను కించపరిచేలా మాట్లాడటంపై రజక, బీసీ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. పురాణాల్లో సామెతల పేరుతో ఐటీ ఉద్యోగి రజకులను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడంపై సంఘాల నేతలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రజకుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన మహిళపై కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని కోరారు. బీసీ సేన మండల అధ్యక్షుడు కొండవీటి సురేష్, సంఘాల నేతలు అద్దంకి పాండురంగారావు, అద్దంకి కృష్ణ, రామాను రామోహనరావు, లంకే భాస్కరరావు, తిరుపతి వీరాంజనేయులు, ఓలేటి ఆంజనేయులు, కొండవీటి రామకృష్ణ, అవనిగడ్డ శ్రీనివాసరావు, పాగోలు వెంకటప్రసాద్, కోడూరు దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో 67వ క్రీడా సమాఖ్య నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వాలీబాల్ కోర్టును ఎంపీపీ అనగాని రవి, ఖో-ఖో కోర్టును జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, కబడ్డీ కోర్టును పాఠశాల హెచ్‌ఎం ఎస్.రవీంద్రభవాని ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. గన్నవరం ప్రాంతం క్రీడలకు పుట్టినిల్లు అన్నారు. ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన చరిత్ర ఉందన్నారు. క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తోందని చెప్పారు. ప్రతిభవంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకువచ్చేందుకు ఆడుదాం ఆంధ్రాను నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులకు ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆర్థికంగా అండగా నిలుస్తున్నారని చెప్పారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ...విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడల్లో రాణించడం


వాలీబాల్ కోర్టును ప్రారంభిస్తున్న ఎంపీపీ అనగాని

ద్వారా స్పోర్ట్స్ కోటలో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునని చెప్పారు. అనంతరం బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, యోగా, టెన్నిస్, బాల్ బ్యాడ్మింటన్, బాలికలకు వాలీబాల్ క్రీడల్లో ఎంపికలు నిర్వహించారు. నియోజకవర్గ క్రీడల సమన్వయకర్త ధనియాల నాగరాజు, మండలాల సమన్వయకర్తలు హరినారాయణ, వెంకటేశ్వరరావు, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు విద్యార్థుల ఎంపిక


జిల్లా జట్టుకు ఎంపికైన పోరంకి విద్యార్థులు

పెనమలూరు: పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. హెచ్‌ఎం మల్లినేని సుమలత మంగళవారం వివరాలు తెలుపుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో పెనమలూరు నియోజకవర్గం నుంచి జరిగిన సెలక్షన్స్‌లో పోరంకి పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. అండర్ 17 వాలీబాల్‌లో వై.హరిశంకరప్రసాద్, అండర్ 14 వాలీబాల్‌లో వై.విజయ్, అండర్ 17 షటిల్ బ్యాడ్మింటన్‌లో పి.జానకి, అండర్ 14 షటిల్ బ్యాడ్మింటన్‌లో ఎస్.ఉష జిల్లా జట్టుకు ఎంపియ్యారని చెప్పారు. ఈ సందర్భంగా పీడీలు కె.విజయలక్ష్మి, కె.మంగయ్య, విద్యార్థులను అభినందించారు.

వాలీబాల్, బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక


నియోజకవర్గ స్థాయికి ఎంపికైన వాలీబాల్ బాలికల జట్టు

ఉయ్యూరు: పెనమలూరు నియోజకవర్గ స్థాయికి వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ జట్లు ఎంపికయ్యాయి. స్థానిక జెడ్పీ పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, 17 విభాగాల్లో బాల బాలికలకు వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు మంగళవారం జరిగాయి. పోటీల్లో ఉయ్యూరు, కంకిపాడు, పెనమలూరు మండలాలకు చెందిన క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి జట్టుకు ఎంపిక చేశామని నియోజకవర్గ స్థాయి స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ జీవీ రమణ తెలిపారు. జట్ల ఎంపికను పాఠశాల హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సుధాకర్‌రావు, పలువురు పీడీలు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తిపై దాడి

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో మతిస్థిమితం లేని వ్యక్తిపై పలువురు దాడి చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. పెదపులిపాక ఎన్టీఆర్ కాలనీలో దేవిశెట్టి రామకృష్ణ కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతని కుమారుడు శ్రీరామమూర్తికి మతిస్థిమితం లేదు. అతను నడుచుకుంటూ వస్తుండగా అదే కాలనీకి చెందిన వర్మ, నాగరాజు, ప్రసాద్ అనే వ్యక్తులు దాడి చేశారు. మతిస్థిమితం లేని తన కుమారుడిపై దాడి చేశారని రామకృష్ణ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

సెంట్రల్ డివిజన్ ఏసీపీ భాస్కరరావు



పటమట(విజయవాడతూర్పు): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలు ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సెంట్రల్ డివిజన్ ఏసీపీ పి. భాస్కరరావు సూచించారు. ఆటోనగర్ లోని ఏటీపీ హాల్లో పటమట సీఐ కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో 150 గణేష్ మండపాల నిర్వాహకులతో మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ప్రతి మండపం వద్ద పాయింట్స్ బుక్స్ ఏర్పాటు చేయాలని, పోలీస్ అధికారులు, బ్లూ కోల్ట్స్ సిబ్బంది తరచూ తనిఖీ చేస్తార తెలిపారు. మండపాల వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే మండప నిర్వహకులే పూర్తి బాధ్యత వహించాలన్నారు. వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు పూర్తి బాధ్యతలను నిర్వాహకులు తీసుకోవాలని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సైలు పద్మ, సత్యనారాయణ, శాతకర్ణి, విక్రమ్ పాల్గొన్నారు.

పోలవరం కాల్వలో వినాయక విగ్రహాల నిమజ్జనం

నున్న(విజయవాడరూరల్): నున్న పోలవరం కాల్వలో వినాయక విగ్రహాల నిమజ్జనం చేయడానికి అనువైన ప్రాంతాన్ని మంగళవారం పోలీస్ అధికారులు పరిశీలించారు. నగర డెప్యూటీ పోలీస్ కమిషనర్ ఎం.సత్తిబాబు(అడ్మినిస్ట్రేషన్), నార్త్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ సీహెచ్.రవికాంత్, నున్న పోలీస్ స్టేషన్ సీఐ కె.శ్రీనివాసరావులు పోలవరం కాల్వను పరిశీలించారు. పోలవరం కాల్వలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వికాస్ కాలేజీకి వెళ్లే రహదారికి దగ్గరలో ఉన్న పోలవరం కాల్వ వంతెనకు రెండు వైపులా వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేవిధంగా ఏర్పాట్లు చేయాలని స్థానిక గ్రామ పంచాయతీ అధికారులకు సూచించారు. విగ్రహాల వెంట వచ్చే ప్రజలు రద్దీని దృష్టిలో ఉంచుకొని, ఇబ్బందులు లేకుండా బ్యారికేట్లు, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు అధికంగా వస్తే రద్దీ లేకుండా చూసేందుకు పోలీసుల పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. పోలవరం కాల్వను పరిశీలించిన వారిలో నున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ, సిబ్బంది ఉన్నారు. నున్న, అజిత్‌సింగ్‌నగర్, సత్యనారాయణపురం ప్రాంతాల్లోని విగ్రహాలను పోలవరం కాల్వలో నిమజ్జనం చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.


అధికారులతో చర్చిస్తున్న డీసీపీ సత్తిబాబు

చిరుధాన్యాలతో బహుళ ప్రయోజనాలు

రామవరప్పాడు: చిరుధాన్యాలతో బహుళ ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని, వీటిని నిత్యం తీసుకునే ఆహార పదార్థాల్లో ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ మంగ తెలిపారు. రామవరప్పాడు జెడ్పీ పాఠశాలలో మంగళవారం పోషణ్ మాహ్ కార్యక్రమంలో భాగంగా 'చిరు ధాన్యాలతో ప్రయోజనాలు' అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. చిరుధాన్యాల్లో ఉండే ఆరోగ్యకరమైన పోషకాల వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి ఆరోగ్యంగా ఉంచుతుందన్నారు. నిత్యం చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల గుండెకు సంబంధించిన జబ్బులు, క్యాన్సర్, మధుమేహం, మలబద్ధకం వంటి రోగాల నుంచి కాపాడుకోవచ్చునని తెలిపారు. ప్రతి రోజు ఉడకబెట్టిన గుడ్డు, రాగిజావ, బెల్లం, పల్లీలు, మునగాకు, కరివేపాకు, రాగులు, సజ్జలు వంటివి ఆహారంలో తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆహార పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ మంగ

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సీడీపీఓ సుకన్య



కంకిపాడు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు సీడీపీఓ కేబీ సుకన్య అన్నారు. కంకిపాడులోని 8వ సెంటర్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో పోషకాలు అధికంగా ఉండే ఆహార పదార్థాలను అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసి ప్రదర్శించారు. ప్రదర్శనను సీడీపీఓ సుకన్య తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, కొర్రలు, సామలు, ఊదలు తదితర వాటితో తయారు చేసిన ఆహార పదార్థాలను తినటం వల్ల అవసరమైన పోషకాలు శరీరానికి అందుతాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అన్నామణి, అంగన్‌వాడీ టీచర్లు, జీఎంఎస్‌కే నాగమణి తదితరులు పాల్గొన్నారు.